# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మూలధన వ్యయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును 2027 పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్యమకారులకు సంవిధాన్ హత్యా దివాస్ పేరిట నివాళి అర్పిస్తున్నామని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు.
- ❖ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జగన్నాధుని రథయాత్ర రేపు పూరీలో ఘనంగా ప్రారంభం కానుంది.
- ❖ వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

మూలధన వ్యయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి ఈరోజు చేపట్టిన సమీక్షలో భాగంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులపై మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో ఆయన క్యాంప్ కార్యాలయంలో చర్చించారు. పింఛన్లతో సహా సంక్షేమ కార్యక్రమాలకు ప్రతినెలా వెచ్చిస్తున్న ఖర్చుతో పాటు... రానున్న రోజుల్లో వివిధ పథకాల అమలు, అభివృద్ధి పనులకు అవసరమయ్యే నిధుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాబార్డు నుంచి నిధులు సమీకరించి పంచాయతీ రాజ్ శాఖపై ఎక్కువ ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సూచించారు. వివిధ కార్యక్రమాల కింద ఇచ్చే కేంద్ర ప్రభుత్వ నిధులను మూలధన వ్యయానికి ఖర్చు చేయాలని అన్నారు. సంపద సృష్టికి కారణం అయ్యే మూలధన వ్యయం మరింత పెంచాలని.. ఆ తరహా ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

==========================

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం ఈరోజు రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద అట్టహాసంగా జరిగింది. 94.44 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి

కందుల దుర్గేష్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. త్వరితగతిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. తద్వారా 8 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 2035 నాటికి 35 లక్షల పర్యాటకులు రావడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు ఉండనుందని ఆయన పేర్కొన్నారు. 2027 పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రాజెక్టును పూర్తి చేసి రాజమహేంద్రవరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

==========================

అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ రోజు గుంటూరు నగరంలో నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. నగరంలోని అమరావతి రోడ్డులో వేలాది మంది విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రచార ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన వేదికలో యువత నుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

నియంతృత్వాన్ని తిరస్కరించి, నైతికతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఉద్యమకారుల త్యాగమే ఈ రోజు భారత ప్రజాస్వామ్యాన్ని బలంగా నిలబెట్టిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. విజయవాడ నగరంలో 1975 జూన్ 25న దేశంలో విధించిన అత్యవసర పరిస్థితిపై బిజెపి రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన “సంవిధాన్ హత్యా దివాస్” కార్యక్రమంలో పాల్గొని ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్యమకారులకు నివాళులు అర్పిస్తుందన్నారు. జూన్ 25ను “బలిదాన దినం”గా గుర్తించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఇది కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం మాత్రమే కాదని భవిష్యత్‌లో అలాంటి నియంతృత్వపు కుట్రలు పునరావృతం కాకుండా జాగృతంగా ఉండాల్సిన స్ఫూర్తిదాయక సమయమని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

==========================

ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన జగన్నాథ రథయాత్ర రేపు పూరీలో ఘనంగా ప్రారంభం కానుంది. ప్రతి ఏటా జరిగే ఈ రథయాత్రలో లక్షల మంది భక్తులు పాల్గొంటారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక మరోవైపు జగన్నాథ రథయాత్ర నేపథ్యంలో భారతీయ రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఆమదాలవలస మీదుగా శ్రీకాకుళం రోడ్ మార్గంలో ప్రత్యేక రైళ్లు నడవనున్నాయని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 08445 రైలు నంబర్ తో రేపు జగదల్‌పూర్ నుంచి పూరీ వరకు ఒక ప్రత్యేక రైలు నడవనుందని వెల్లడించారు. ఈ రైలు విజయనగరం మీదుగా శ్రీకాకుళం రోడ్‌ను కలుపుకుంటూ ప్రయాణిస్తుందని తెలిపారు. తిరుగు పయనంలో 08446 నంబర్‌తో పూరీలో బయల్దేరి శ్రీకాకుళం మీదుగా విశాఖపట్నం వరకూ ఈ రైలు ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. అలాగే జూన్ 28, జూలై 5, 6 తేదీల్లో కూడా ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.

==========================

బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ వల్ల ఎంతో మంది అమాయకులు మోసపోతున్నారని అటువంటి సైబర్ క్రైమ్స్ నుండి వారిని కాపాడేందుకు బలమైన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘు రామకృష్ణ రాజు తెలిపారు. ఈ అంశంపై ప్రజలను, ప్రభుత్వయంత్రాగాన్ని అప్రమత్తం చేసేందుకు వచ్చే శాసన సభ సమావేశాల్లో చర్చ జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈరోజు ఆయన అసెంబ్లీ భవనంలోని తన ఛాంబరులో శాసన సభ పిటిషన్ల కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అనతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ కి సంబందించి భీమవరం నుండి తమ పిటీషన్స్ కమిటీకి ఒక ముఖ్యమైన పిటిషన్ వచ్చిందన్నారు. ఆ పిటీషన్ పై నేడు జరిగిన శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా జరిగే సైబర్ క్రైమ్స్ రోజు రోజుకి పెరిగిపోతూన్నాయని, వీటి బారిన పడిన ప్రజల జీవితాలు అస్తవ్యస్త మవుతున్నాయని పేర్కొంటూ…

(వాయిస్ 15 సెకన్లు)

==========================

అంతరిక్ష రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలపడంతో పాటు, 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పెట్టుబడుల లక్ష్యం నెరవేరితే ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు.

==========================

వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు అల్పపీడనం ఏర్పడిందని.. ఇది ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు చెదురుమదురుగా పిడుగులతో కూడిన భారీ వర్షాలు, 40 నుండి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని… ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.

==========================
==========================